క్లుప్తంగా

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీస్ జిల్లా కార్యదర్శి శివశంకర్

చేవెళ్ల: హైదరాబాద్ ఫరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్న మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భానుప్రసాద్‌లు పేర్కొన్నారు. చేవెళ్లలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద క్రిష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. వర్గీకరణ కోసం చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

జోరుగా బహుజన సమాజ్ పార్టీ ప్రచారం



చిన్నమంగళారంలో ప్రచారం నిర్వహిస్తున్న కాశీవిశ్వనాథ్

మొయినాబాద్‌రూరల్: బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి రాజమహేంద్రవర్మను ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మొయినాబాద్ మండల అధ్యక్షుడు జీనుకుంట కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. చిన్నమంగళారం, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గడపగడపకు తిరుగుతూ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. హిమాయత్‌నగర్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు ఆర్య, నర్సింహ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్



ఎంపీపీ రవీందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. లేమామిడి గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఎంపీపీ రవీందర్‌యాదవ్‌తో పాటు పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ దైవ చింతన కలిగి ఉండటం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీ లక్ష్మమ్మ, గోగు వెంకట్‌నారాయణరెడ్డి, అంజిరెడ్డి, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జమాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

శంకర్‌పల్లి: పేకాట ఆడుతున్న స్థావరంపై మోకిల పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మోకిలతండా శివారులోని వ్యవసాయ పొలం వద్ద రేకుల షెడ్డులో పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వడిత్యా రాములు, నార్య, దుర్గేశ్, కేతావత్ శంకర్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.47,900లు, మూడు మొబైల్ ఫోన్‌లు, 52పేకలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

'రవీంద్రభారతి'లో దీపావళి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో దీపాలు వెలిగించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ మాట్లాడుతూ జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల పండుగే దీపావళి అని అన్నారు.

జాతీయ సాహస శిబిరానికి ఎంపిక



నీరటి పూజిత



క్రాంతికుమార్

షాద్‌నగర్: డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ సాహస శిబిరానికి పట్టణంలోని బీఏఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సాహస శిబిరానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. బీఏఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు నీరటి పూజిత (బీఏ ద్వితీయ సంవత్సరం), క్రాంతికుమార్ (బీఎస్సీ మొదటి సంవత్సరం) విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ మచ్చందర్, విద్యార్థులు అభినందించారు.

అయ్యప్ప దీక్షతో.. మోక్షం

చన్నీటి స్నానం ఒంటి పూట భోజనం

- ఆరోగ్య దాయకం
- ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుంది
- ఏటా పెరుగుతున్న మాలధారులు



పడిపూజ చేస్తున్న సతీశ్‌నాయర్ గురుస్వామి (ఫైల్)

షాబాద్: అయ్యప్ప స్వామి దీక్ష అందరికీ మోక్షదాయకం. స్వామియే శరణం..అంటూ శరణు ఘోష.. అయ్యప్ప నామ స్మరణ శుభదాయకం. పదునెనిమిది మెట్లను పరమభక్తితో తరించిన వారి జన్మ ధన్యం. అయ్యప్ప నామ స్మరణతో మొదలు దీక్షా ప్రారంభమవుతుంది. మాలదారులు దీక్ష తీసుకొని కఠోర బ్రహ్మచర్యాన్ని అవలంభిస్తున్నారు. ఈ దీక్షతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతందని స్వాముల విశ్వాసం. ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో అయ్యప్ప దీక్షను స్వీకరిస్తుంటారు. ఎక్కువగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో పెద్ద ఎత్తున స్వాములు దీక్ష స్వీకరిస్తున్నారు. ఈ మాసంలో నిర్వహించే పూజలకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఉదయం, సంధ్యావేళల్లో, చన్నీటి స్నానం, ఒంటిపూట భోజనం కటిక నేలపై నిద్రించడం వంటి చర్యలతో ఆరోగ్యంగా ఉండొచ్చు. మాలధారణ చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను సైతం మాత, స్వామి అంటూ పిలవాల్సి ఉంటుంది. అయ్యప్ప మాలధారణ చేయించే గురుస్వామిని భక్తితో పూజించాలి. షాబాద్ మండలంలో ఈ ఏడాది దాదాపు వెయ్యి మందికి పైగా మాలధారణ చేయనున్నట్లు అంచనా.

దీక్ష వల్ల కలిగే ఫలితాలు..

అయ్యప్ప దీక్ష స్వీకరించడం వల్ల సమాజంలో కుల మత బేధాలు, పేద, ధనిక తారతమ్యాలు కనిపించవు. ఉపవాసం ఉండడంతో జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. రక్తం, జీర్ణవ్యవస్థ శుద్ధి అవుతాయి. శరీరంలో స్థాయికి మించిన కొవ్వు ఉంటే కరిగిపోతుంది. ఏకాగ్రతను పెంచుతుంది. గందం, కుంకుమ, విభూతి, తులసిమాల ధరించడంవలన నాడి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. సామూహిక పూజలు, భజనలతో మానసిక రోగాలు తొలగిపోతాయి. పూజా సమయంలో గంటల శబ్దాలవల్ల శరీరంలోని అవయవాలకు నూతనోత్సాహం లభిస్తుంది. దురలవాట్లకు దూరమై భక్తి భావాలు పెరుగుతాయి.

స్వాములకు పేర్లు..

మొదటి సారి మాలధరిస్తే కన్యస్వామి, రెండోసారి కత్తిస్వామి, మూడోసారి గంటస్వామి, నాలుగోసారి గదస్వామి, ఐదోసారి పెరుస్వామి, ఆరోసారి గురుస్వామి, ఏడు అంతకన్న ఎక్కువసార్లు గురుస్వాములని, 18 సార్లు, అంతకన్న ఎక్కువసార్లు మాల ధరిస్తే నారికేళస్వాములని సంబోధిస్తారు.

మధురానుభూతి కలుగుతుంది..



అయ్యప్పస్వామిని స్మరిస్తూ ఆయన సేవలో గడపడం మధురానుభూతిని కలిగిస్తుంది. 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అయ్యప్ప మాల ధరించి దీక్ష తీసుకుంటున్నాను. ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆర్థికంగా కలిసి వస్తుండడంతో అయ్యప్పస్వామి దర్శన భాగ్యమేనని విశ్వసిస్తున్నా.

– దర్పల్లి రవీందర్‌గౌడ్, గురుస్వామి, షాబాద్

ఆరోగ్యానికి మేలు...



అయ్యప్ప మాలధారణ నియమ నిష్టలతో కూడుకొని ఉంటుంది. దీంతో మనుసుకు ప్రశాంతత లభిస్తుండడంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చు. సూర్యోదయం కన్న ముందు సూర్యాస్తమయం తరువాత రోజుకు రెండుసార్లు స్నానం చేయడం ఒకపూట భోజనంతో మానసికోల్లాసం పెరుగుతుంది.

– గొలుసుల వెంకటేశ్, గురుస్వామి, నాగర్‌గూడ

చేవెళ్ల అసెంబ్లీకి 13 నామినేషన్లు

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీకి 13 నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. శుక్రవారం చేవెళ్లలోని రిటర్నింగ్ కార్యాలయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పలుపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ నుంచి పామెన భీంభరత్, పామెన అమృతలు, బీజేపీ నుంచి కెఎస్ రత్నం, బీఆర్ఎస్ నుంచి కాలె యాదయ్య తరుపున ఆయన కుమారుడు శ్రీకాంత్, బీఎస్పీ నుంచి రాజమహేంద్రవర్మ, ధర్మ సమాజ్ పార్టీ నుంచి ముప్పిడి స్టాలిన్ రవీంద్ర మహరాజ్, ఇండియా ప్రజా బంధు పార్టీ నుంచి మేకల శ్రీనివాస్, యుగ తులసీ పార్టీ నుంచి మెద్దల నర్సింలు, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్‌పార్టీ బేగరి రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా కాలె శ్రీకాంత్, బైండ్ల నర్సింలు, కొత్త రవీందర్, తడుము పాండులు నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

చివరి రోజు..

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో భాగంగా చివరి రోజు శుక్రవారం 17 నామినేషన్లు, 27 సెట్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు తెలిపారు. నామినేషన్ వేసిన వారిలో అంజయ్యయాదవ్ (బీఆర్ఎస్) 3 సెట్లు, వీర్లపల్లిశంకర్ (కాంగ్రెస్) 2 సెట్లు, వినయ్‌కుమార్ (విద్యార్థుల రాజకీయ పార్టీ) సెట్, మంచాల భిక్షపతి (ధర్మసమాజ్ పార్టీ) సెట్, పాలమూరువిష్ణువర్ధన్‌రెడ్డి (ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్) 3 సెట్లు, ప్రశాంత్‌కుమార్ (బీఎస్పీ) 2 సెట్లు, అందరి అంజయ్య (ఇండిపెండెంట్) 2 సెట్లు, ఎమ్మెసంతోష్‌కుమార్ (ఇండిపెండెంట్) సెట్, బుయ్యంకార్‌రవీందర్(ఇండిపెండెంట్) సెట్, శివకుమార్(ధర్మసమాజ్ పార్టీ) సెట్, రహమొద్దీన్ (ఆల్ ఇండియా సమతా పార్టీ) 2 సెట్లు, అందెరాజేశ్వర్ (ఇండిపెండెంట్) సెట్, ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ (ఇండిపెండెంట్) సెట్, ఇందిర (ఇండిపెండెంట్) సెట్, నవీన్‌కుమార్ (యుగతులసి పార్టీ) 2సెట్లు, రాఘవేందర్ (ఇండిపెండెంట్) సెట్, మహ్మద్‌ఖాజాముఫీజోద్దీన్ (జై స్వరాజ్ పార్టీ) 2 సెట్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు తెలిపారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం

బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల



ప్రచారంలో బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం గెలుపు ఖాయమని, చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ నుంచి చేవెళ్లకు భారీ ర్యాలీ నిర్వహించారు. చేవెళ్లలో మాజీ ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా కేఎస్ రత్నం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు కిరణ్, క్యామ నారాయణ, రవీందర్‌రెడ్డి, మాణెయ్య, మహేశ్, కూతరు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: రానున్నది బీజేపీ ప్రభుత్వమని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ బీర్ల నర్సింలు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం నామినేషన్ దాఖలు చేస్తున్నందునా మండలంలోని జనవాడ గ్రామంలో వార్డు సభ్యుడు బీర్ల శివరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

పేద విద్యార్థులను ఆదుకోండి

హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్



చెక్కు అందజేస్తున్న రవినాయక్

మొయినాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ఆదుకోవాలని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ అన్నారు. అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం ఫీజుతో పాటు పరీక్షలకు సంబంధించిన సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల చదువుకోసం హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ పది సంవత్సరాల నుంచి సహకరిస్తుందన్నారు. పదోతరగతి విద్యార్థుల ఫీజును ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారి బి.సుచిత్ర అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్‌బాబు, ఉపాధ్యాయులు మంజుల, సంజీవ్‌కుమార్, సంగీత, నాగేశ్‌బాబు, స్వరూప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం



షాబాద్ చౌరస్తా నుంచి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్

షాబాద్: కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందని పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎన్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ నుంచి చేవెళ్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ నామినేషన్ వేసేందుకు భారీ వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రైతులకు మొట్టమొదటిసారిగా ఉచిత కరెంట్‌ను అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చినప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. 9 సంవత్సరాలుగా అధికారంలో ఉండి ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతాంగాన్ని, నిరుద్యోగులను, కార్మికులను మోసం చేసిందని వారు ఆరోపించారు. మహిళా అధ్యక్షురాలు అశ్వని, పెంటారెడ్డి, రవీందర్, రాహుల్‌గుప్తా, చెన్నయ్య, యాదయ్య, శ్రీరాంరెడ్డి చంద్రయ్య, రవికుమార్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, జయమ్మ వెంకట్‌రెడ్డి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపుఖాయమని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి చేగూరులో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పసుల బుచ్చయ్య, శ్రీశైలం, అంజమ్, దారుర్ సతీశ్, నిరంజన్‌గౌడ్, దశరత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు దీటుగా బలప్రదర్శన



చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ నామినేషన్‌కు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

నామినేషన్ వేసిన కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి పామెన భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల కాలుకు చెప్పులా ఉంటానని అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీలో పాల్గొని నామినేషన్ వేశారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ నాయకులతో పాటు మాజీఎమ్మెల్యే యాదవ్‌రెడ్డి పాల్గొన్నారు. చేవెళ్లలోని షాబాద్ చౌరస్తానుంచి బస్‌స్టాండ్ వరకు బలప్రదర్శన చేసినట్లుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, చేవెళ్లలో కాంగ్రెస్ హవా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, షాబాద్ దర్శన్, డీవీఆర్, ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, ప్రభాకర్, నర్సింలు, గోపాల్‌రెడ్డి, అనంతరాములు, మధుసూదన్ గుప్తా, సీపీఐ నాయకులు రామస్వామి, సత్తిరెడ్డి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



మొగిలి (ఫైల్)

కేశంపేట: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన వరికుప్పల మొగిలి (28) వడ్డెర పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మొగులు గ్రామం నుంచి కొత్తపేట గ్రామానికి వెళ్తుండగా అల్వాల గ్రామ శివారులోని ఏస్సార్ పెట్రోల్ పంపు దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చిరంజీవి (ఫైల్)

మొయినాబాద్: చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మొయినాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. అతని వద్ద ఆర్టీసీ బస్‌పాస్, సెల్‌నెంబర్‌లతో సేకరించిన ఆధారాలతో అతను ఏపీలోని కడప జిల్లా కొత్త మాధవరం మండలం ఉప్పరిపల్లికి చెందిన బయ్యబోయిన చిరంజీవి(35)గా గుర్తించారు. అతను మొయినాబాద్‌లో ఉంటూ శుక్రవారం ఉదయం అంజనాదేవి గార్డెన్ ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు ఉన్నట్లు వారు గుర్తించారు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న పల్లె ఆనంద్‌కుమార్

కేశంపేట: పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె స్వాతి, సంతాపూర్ సర్పంచ్ అంజయ్యతో పాటు పల్లె బ్రదర్స్, పలువురు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ చేరారు. వారికి పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె ఆనంద్‌కుమార్, పల్లె బాలీశ్వర్‌లు మాట్లాడుతూ... కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. కాశినాథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, తాండ్ర శ్రావణ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజు, శ్రీను, లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి



ఏటీఎంను ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

కేశంపేట: కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కేశంపేట సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నారు. కేశంపేటలో శుక్రవారం కెనరా బ్యాంక్ చీఫ్ మెనేజర్ విజయ్‌కుమార్‌తో కలిసి గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి బ్యాంక్ ఏటీఎంను ప్రారంభించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు, వ్యాపారులకు, వినియోగదారుల సౌకర్యం కోసమే ఏటీఎంను బ్యాంక్ సిబ్బంది ఏర్పాటు శారన్నారు. బ్యాంక్ సిబ్బంది శ్రీహరి, వీరేశ్, గ్రామస్తులు రమేష్‌గౌడ్, శ్రీనివాసులు గుప్తా, ధవరెడ్డి, వెంకటయ్య, రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్‌లో చేరినవారితో నవీన్‌రెడ్డి

జెడ్పీమాజీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి

నందిగామ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. నర్సప్పగూడలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి సురేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత అంజన్నకే దక్కుతుందన్నారు. కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మె సత్యనారాయణ, సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ కలమ్మ కుమార్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి నవీన్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ వస్తే మేలు

హుడాకాంప్లెక్స్: పేదల పార్టీ కాంగ్రెస్ అని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా సరూర్‌నగర్ డివిజన్ పరిధి డాక్టర్స్, లక్ష్మీనగర్ కాలనీల్లో పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు అవుతాయని, చేతి గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, రాముగౌడ్, రవీంద్ర, ఇమ్రాన్‌అలీ, సంతోష్, నిర్మలారెడ్డి, అరుణ, రవళి, సుశీల పాల్గొన్నారు.

చేవెళ్లకు తరలిన కాంగ్రెస్ నాయకులు



మొయినాబాద్ నుంచి ర్యాలీగా తరలిన కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్: నామినేషన్ల చివరి రోజు శుక్రవారం చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా మొయినాబాద్ నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీగా తరలారు. మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌యాదవ్, రాజేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.